మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

చంపాపేట: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి, ఆ పార్టీ జెండాను ఎగురవేయడం ఖాయమని ఎల్బీన గర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన అభ్యర్థి లక్ష్మారెడ్డితో కలిసి చంపాపేట డివిజన్‌లోని కటకోనికుంట, హరిజన బస్తీ, మహంకాళమ్మతోట, కుమ్మరి బస్తీల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముడుపు రాజిరెడ్డి, అంజిరెడ్డి, జంగయ్య, సుదర్శ న్, సతీష్‌గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్‌లో...

కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని శుభోదయ, బైరా మల్‌గూడ, సాయినగర్, దుర్గానగర్, మాధవనగర్ కాలనీల్లో చంపాపేట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ వెళ్లి పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు ఉమామహేశ్వర్, రోజా రెడ్డి, రమాదేవి, వసంతరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

పాఠ్యాంశేతర విషయాలపైనా ఆసక్తి పెంచాలి



చంపాపేట: విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు ఇతర విషయాలపై కూడా ఆసక్తి పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు లెక్కల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా సంవత్సర ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులు ఇష్టంతో చదివితే ఎంచుకున్న గమ్యాన్ని సునాయాసంగా చేరుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఫోక్, శాస్త్రీయ, వెస్ట్రర్న్ నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఈ విద్యా సంవత్సరంలో చదువుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు, ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లలితారెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్, నర్సింహ, శేఖర్‌రెడ్డి, అనిత, బీనా, అవీనా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయాలనే రాజకీయాల్లోకి..

ఈటల రాజేందర్ సతీమణి జమున


కొలను శివారెడ్డినగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఈటల జమున, కార్పొరేటర్ కొప్పుల

మన్సూరాబాద్: ప్రజలకు సేవా చేయాలనే మంచి ఉద్దేశంతోనే ఈటల రాజేందర్ రాజకీయాల్లోకి వచ్చారని ఆయన సతీమణి జమున అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి హరిణ వనస్థలి జాతీయ పార్కులో, హయత్‌నగర్ పరిధిలోని కొలను శివారెడ్డినగర్‌కాలనీ, టీనగర్‌కాలనీలో ఆదివారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజకీయాల్లో విశేష అనుభవం ఉన్న ఈటల రాజేందర్‌ను గెలిపించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటియ్యాలని పిలుపునిచ్చారు. వివిధ కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

చంపాపేటలో...

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి ఆదివారం డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్, శుభోదయకాలనీల్లో గడప గడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మరోసారి మోదీప్రధానీగా చూడాలని, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సందీప్‌రెడ్డి, దశరథగౌడ్, రమేష్‌గౌడ్, శ్రీకాంత్, మల్లేష్, దేవరాజ్, సందీప్, గిరి తదితరులు పాల్గొన్నారు.

మోదీ సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తాయి: సంరెడ్డి


చింతల్‌బస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న సురేందర్‌రెడ్డి, శ్వేతామధుకర్ రెడ్డి

సైదాబాద్: అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రభావమే బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తాయని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, డివిజన్ బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి చింతల్‌బస్తీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పార్టీ కరపత్రాలు పంచుతూ హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతను గెలిపించాలని అభ్యర్థించారు. అభివృద్ధిని కాంక్షిస్తున్న హైదరాబాద్ వాసులు ఈసారి ఎన్నికల్లో పాతబస్తీలో మార్పు కోరుకుంటున్నారని సురేందర్‌రెడ్డి అన్నారు. మజ్లిస్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే బీజేపీ అభ్యర్థిని బలపర్చాలని ఆయన ఓటర్లను కోరారు. ప్రచారంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్ యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ యాదవ్

అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్

మలక్‌పేట: హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయడం తథ్యమని ఆ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మలక్‌పేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తీగల అజిత్‌రెడ్డి అధ్యక్షతన మూసారంబాగ్‌లోని రజక భవన్‌లో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైండ్ గేమ్ ఆడుతోందని, ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రజల్లో నమ్మకం కోల్పోయిందన్నారు. కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ, ఎంఐఎంలకు తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కేసీఆర్‌పై ప్రజలకు అపారమైన విశ్వాసం ఉందని, ఆయన అందించిన పాలనను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ఈనెల 29 తేదీ నుంచి ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లో ప్రచారం కొనసాగుతుందని ఇన్‌ఛార్జి తీగల అజిత్‌రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నేతలు ఆజంఅలీ, తీగల సునరితారెడ్డి, భూమేష్, సామ ప్రభాకర్‌రెడ్డి, బాబుసుదర్శన్, శ్రీధర్‌రెడ్డి, మహేష్‌కుమార్, డివిజన్ల అధ్యక్షులు రఘునందన్‌రెడ్డి, జగన్‌గుప్తా, కామేష్, శ్రీనివాస్ రెడ్డి, బాబూరావు, నాయకులు లక్ష్మణ్ ఠాకూర్, లాయక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి


లింగోజిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

లింగోజిగూడ: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా లింగోజిగూడ డివిజన్ పరిధిలోని శాతవాహన నగర్, ఎస్‌బీహెచ్ కాలనీ, కాకతీయ కాలనీ, మైత్రినగర్, నవోదయ కాలనీ, గౌతమ్ నగర్ కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్, స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, మల్లారపు షాలిని, కందికంటి శ్రీధర్‌గౌడ్, ఉప్పల శ్రావణ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లిలో తాగునీటి ఎద్దడి

- మూడు, నాలుగు రోజులకోసారి నీటి సరఫరా
- వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్న జనం
- పట్టించుకోని అధికారులు


ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉస్మాన్‌నగర్ వాసులు

పహాడీషరీఫ్: హైదరాబాద్ మహా నగరాన్ని ఆనుకొని ఉన్న జల్‌పల్లి మున్సిపాలిటీలో కృష్ణా నీటి సరఫరా ఇప్పటికీ పూర్తి స్థాయిలో లేదు. పక్కనే ఉన్న పాతబస్తీలో రోజు విడిచి రోజు పుష్కలంగా నీటి సరఫరా జరుగుతున్నా.., ఇక్కడ మాత్రం మూడు, నాలుగు రోజులకోసారి అరకొర సరఫరా అవుతోంది. కొన్ని బస్తీల్లో వాల్వ్ ఇతర మరమ్మతుల కారణంగా సరఫరా నిలిచిపోవడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఉస్మాన్ నగర్, క్యూబా కాలనీ, వాదే ముస్తఫా, సాదత్ నగర్‌లలో ప్రధానంగా సమస్య నెలకొంది. వెరసి ఇక్కడి ప్రజలు అనధికార వాటర్ ప్లాంట్లలో లీటర్ల చొప్పున కొనుగోలు చేస్తూ అటు ఆరోగ్యం, ఇటు జేబులకు చిల్లులు పెట్టుకోవాల్సి వస్తోంది.

మిషన్ భగీరథ ఫేజ్–2

మిషన్ భగీరథ ఫేజ్–2 కింద ఈ మున్సిపాలిటీలో రూ.72 కోట్ల వ్యయంతో వాటర్ ట్యాంకల నిర్మాణం, పైప్‌లైన్ల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం కొత్తపేట గ్రామ పరిధిలోని బోడిగుట్టపై 60 లక్షలు, పహాడీషరీఫ్‌లో 30 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. రెండు రిజర్వాయర్ల నిర్మాణంతో పాటు పైప్‌లైన్ లేని బస్తీల్లో లైన్లు వేసే పనిలో అధికారులు తలమునకలయ్యారు. అంతకుముందు ఫేజ్–1 కింద జల్‌పల్లి, శ్రీరాం కాలనీలో 5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 2 ట్యాంక్‌లు, వాదే ముస్తఫాలో 20 లక్షల ట్యాంక్, బిస్మిల్లా కాలనీలో 3 లక్షల ట్యాంక్, ఎర్రకుంటలో 90 వేల సామర్థ్యం కలిగిన ట్యాంక్‌లు నిర్మాణం పూర్తి చేసుకొని ప్రజల దాహార్తిని కొద్ది మేర తీరుస్తున్నాయి.

అక్రమ నీటి కనెక్షన్లు..

సాధారణంగా డిమాండ్‌ను బట్టి ఆ స్థాయిలో సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో మాత్రం స్థానిక పరిస్థితుల ప్రభావంతో పెద్ద ఎత్తున అక్రమ నీటి కనెక్షన్లను తీసుకున్నారు. ఇందులో ప్రధానంగా పహాడీషరీఫ్ గ్రామమే పరిగణనలోకి వస్తుంది. రికార్డ్‌లో ఉన్న కనెక్షన్లకు సరిపడా మాత్రమే నీటి సరఫరా చేస్తున్నారు. కానీ అక్రమ కనెక్షన్లు రెండు మూడింతలు ఉండటంతో నీటి సరఫరా కష్టతరంగా మారింది.

రోజు విడిచి రోజు సరఫరా చేయాలి



మారుమూల గ్రామాలలో సైతం కృష్ణా జలాలు సరఫరా అవుతున్నాయి. కానీ ఈ మున్సిపాలిటీలో పూర్తి స్థాయిలో సరఫరా చేయడం లేదు. క్యూబా కాలనీలో కొన్ని రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇక ప్రైవేట్ ప్లాంట్‌కు వెళ్లాలంటే ఒక్కో డబ్బాకు రూ.15–20లు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మున్సిపాలిటీలో కృష్ణానీటిని సరఫరా చేయాలి. – సయ్యద్ ఫెరోజ్, క్యూబా కాలనీ

చర్యలు తీసుకుంటాం



వేసవిలో నీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకుంటాం. నీటి సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రస్తుతం తుది దశ నిర్మాణంలో ఉన్న రెండు భారీ రిజర్వాయర్లు పూర్తయితే ఇక మున్సిపాలిటీలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అవసరమైన బస్తీలలో వాటర్ ట్యాంకర్ల ద్వారా కూడా నీటి సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాం. – పి గోవింద్ గౌడ్, డిప్యూటీ జీఎం

కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా రామారావు



సైదాబాద్: హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీగా సైదాబాద్ డివిజన్‌కు చెందిన యువనేత తన్నీరు రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ వలీఉల్లా సమీర్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఆ సందర్భంగా సైదాబాద్‌లో రామారావు మాట్లాడుతూ, జిల్లాలో పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంగా కృషి చేస్తామన్నారు. హైదరాబాద్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం నియోజకవర్గ పరిధిలో ప్రచారాన్ని ఉధృతం చేస్తామన్నారు.

బీజేపీలో బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడి చేరిక


శ్యామ్‌కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈటల

నాగోలు: డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పంగా శ్యామ్‌కుమార్ ఆదివారం బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనకు ఈటల బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, సురేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి


సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వట్టిపు యాదయ్య

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టిపు యాదయ్య ముదిరాజ్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యాదయ్య ఎల్‌బీనగర్‌లో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సునీతా మహేందర్‌రెడ్డి విజయానికి అహర్నిశలు పాటుపడతానని స్పష్టం చేశారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 32, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 15, క్యారెట్ 35, దొండ 35, ఆలు 33, ఉల్లి 19.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


కరాటే శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, బెల్టులను అందజేసిన వజీర్ ప్రకాష్‌గౌడ్

నాగోలు: కరాటేలో శిక్షణ పొందితే శారీరక దృఢత్వంతో పాటు మహిళల ఆత్మ రక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్‌గౌడ్ అన్నారు. సెల్యూట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కనకరాజు, సీనియర్ బ్లాక్ బెల్ట్ హోల్డర్ అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ విజయ్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు కొత్తపేట మహిళా భవన్ ఆదివారం వివిధ రకాల బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్, సీనియర్ కోచ్ రఘుకుమార్, డాక్టర్ తనూషాతో కలిసి విద్యార్థులకు కరాటే సర్టిఫికెట్లు, బెల్టులను అందజేశారు. కొత్తపేట డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాలలు, ఇతర పాఠశాలల బాలికలందరూ కరాటేలో శిక్షణ పొందాలని సూచించారు.

మోదీని మళ్లీ ప్రధానిని చేయాలి: సామ


సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన బండ్లగూడ నాయకులు

నాగోలు: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలో బీజేపీ నాయకుడు సుర్వి రాజుగౌడ్ అనుచరులు ఆదివారం బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, బీజేపీ సిద్ధాంతాల మేరకు నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. సహచర కార్యకర్తలు పార్టీ కమిటీలతో కలిసి అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి ఉద్యమాలు చేపట్టడం ద్వారా పార్టీని సంస్థాగతంగా పటిష్ట పర్చేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పోలింగ్ బూత్ నంబర్ 92 లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొని పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు కుంట్లూర్ వెంకటేష్ గౌడ్, డివిజన్ ప్రెసిడెంట్ బద్దం బాలకృష్ణ గౌడ్, దప్పు రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన వారితో మధుయాష్కీ, సునీత మహేందర్ రెడ్డి తదితరులు

ఎల్బీనగర్: మతాల పేరుతో ప్రజల మధ్య బీజేపీ చిచ్చు పెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు వింజమూరి శ్రావణ్‌కుమార్, సంతోష్ రెడ్డిలు వారి అనుచరులతో శనివారం రాత్రి బీఎన్‌రెడ్డినగర్‌లో మధుయాష్కీ, సునీతా రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి అన్ని వర్గాల సంక్షేమం ముఖ్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మల్లారపు షాలిని పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ శ్రీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ 16వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నిత్యహవనం, బలిహరణ, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, చంద్రప్రభ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కాలనీ వాసులు జగన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఓటింగ్‌కు కృషి చేయాలి

చాదర్‌ఘాట్: లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ బూత్‌లో వంద శాతం పోలింగ్ అయ్యేందుకు కృషి చేయాలని మలక్‌పేట నియోజకవర్గం ఏఆర్‌ఓ రాజేష్ కోరారు. ఓటర్లను జాగృతం చేసేందుకు ఆదివారం ఓల్డ్‌మలక్‌పేటలో అధికారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ అవుతున్న బూత్‌ల్లో ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ఒకటని ఆయన అన్నారు. ఈ డివిజన్‌ను ఆదర్శంగా తీసుకొని అన్ని బూత్‌ల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు. ఓటర్లు పోలింగ్ రోజున తమ ఇంటి నుంచి బయటకు వచ్చి ఓటు వేసేలా అవగాహన కల్పించాలని ఏఆర్‌ఓ రాజేష్ కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి


గ్రీన్ హిల్స్ కాలనీలో ప్రచారం చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని టీపీసీసీ మెంబర్, మహేశ్వరం నియోజకవర్గం నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రామకృష్ణాపురం డివిజన్‌లోని చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గ్రీన్ హిల్స్ కాలనీలో గడప గడపకూ పాదయాత్ర చేస్తూ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలక ఉపేందర్ రెడ్డి, శ్రీరామకృష్ణాపురం, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా గణేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో మజ్లిస్ అభ్యర్థి ప్రచారం


ఎన్నికల ప్రచారం చేస్తున్న అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే బలాల


మలక్‌పేట: మజ్లిస్ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం మలక్‌పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి ఓల్డ్‌మలక్‌పేట, ఆజంపురా, చవుని, అక్బర్‌బాగ్ డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. పతంగి గుర్తుకు ఓటేసి మజ్లిస్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. పోలింగ్ రోజున ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ శాతాన్ని పెంచాలని సూచించారు. మలక్‌పేట అభివృద్ధిలో ముందంజలో ఉందని, మరింత అభివృద్ధి కోసం మజ్లిస్‌కు అండగా నిలవాలని అసదుద్దీన్ ఒవైసీ, బలాల విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి


ఆర్‌కేపురంలో ప్రచారం చేస్తున్న పున్న గణేష్, ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ద్వారకానగర్, వాసవి కాలనీలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తలాటి రమేష్ నేత, యాదవ రెడ్డి, లింగాస్వామి గౌడ్, పెద్దవూర సైదులు, భూపాల్‌రెడ్డి, ఎల్లయ్య, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, పగడాల శ్రీశైలం, గోపాల్‌రెడ్డి, పాండు, సుజాత, రాజకుమారి, చిలకరాజు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి సంక్షేమ సంఘం కార్యవర్గం ఏకగ్రీవం


నూతన అధ్యక్షుడు మల్లె కృష్ణమూర్తి

ఎల్‌బీనగర్: చైతన్యపురి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం చైతన్యపురిలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా మల్లె కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా ఎం.రాజేంద్రప్రసాద్, బి.రఘునాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామారావు, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పద్మనాభ శాస్త్రి, కోశాధికారిగా ఏవీ చెన్నయ్య, సహాయ కోశాధికారిగా పవన్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని క్రాంతినగర్ కాలనీలో శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం వేద పండితుల మంత్రోశ్చరణలతో భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ కుమ్మెర సత్యనారాయణ, సభ్యులు ఆనంద్, సత్య నరేందర్, జనార్ధన్, శ్రీనివాస్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



నాగోలు: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్‌బీనగర్ శాతవాహన నగర్ కాలనీలోని ధరణి గ్రాండ్ హోటల్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి (60) కింద పడి చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఘటనా స్థలంలో మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు స్థానికంగా భిక్షాటన చేసేవాడని స్థానికులు చెప్తున్నారని పోలీసులు పేర్కొన్నారు. కాగా, అతడు ఎలా మృతి చెందాడనేది దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.